మోండాలో పర్యటించిన ఎమ్మెల్యే శ్రీగణేష్



అధికారులతో మాట్లాడుతున్న శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీగణేష్ శనివారం మోండా డివిజన్‌లోని శివాజీనగర్, రెజిమెంటల్‌బజార్‌లోని పర్యటించారు. ముందుగా శివాజీనగర్‌లోని పెరుమాళ్ వేంకటేశ్వర స్వామి దేవాలయం, భూ వరాహ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయ శాఖ స్థలంలో నివాసముంటున్న స్థానికులు తమకు యాజమాన్య హక్కులు కల్పించాలని ఆయనకు విన్నవించగా సంబంధిత మంత్రితో మాట్లాడుతానన్నారు. అద్దెల విషయంలో ఎలాంటి ఒత్తిళ్లు చేయవద్దని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. రెజిమెంటల్‌బజార్‌లో రోడ్లు, డ్రైనేజీ సమస్యల గురించి స్థానికులు ఆయన దృష్టికి తీసుకుని రాగా వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట శేఖర్ ముదిరాజ్, బాబూరావు, గౌరిశంకర్, రవి, శ్రవణ్, శ్రీనాథ్, నాగేష్ యాదవ్, నరసింహారావు ముదిరాజ్, సంతోష్ యాదవ్, దేవేందర్, వెంకట్రాజ్, కృష్ణారెడ్డి ఉన్నారు.

ఏం కొనేటట్టు తినేటట్టు లేదు

- వాతావరణ మార్పులు, కొత్త పంటలు ప్రారంభంతో తగ్గిన దిగుబడి
- కర్రీపాయింట్లకు పెరిగిన గిరాకీ

తారెత్తిస్తున్న టామాటా ● ఘాటెకిస్తున్న మిర్చి

సనత్‌నగర్: సీజన్‌లో మార్పులు కూరగాయాల ధరలను అమాంతంగా మార్చేశాయి. టా'మోత' తారెత్తిస్తుంటే.. బెండకాయ బేర్ మనిపిస్తోంది. పచ్చిమిర్చి ఘాటులో అ'ధర'హో అంటుండగా.. ఉల్లి పొగరు కన్నీళ్లను తెప్పిస్తోంది. ఇక బీన్స్ ధర చూస్తే కళ్లు తేలేసే పరిస్థితి. అదే బాటలో చిక్కుడు, క్యారెట్, క్యాప్సికమ్..ఇలా దాదాపు అన్ని రకాల కూరగాయల ధరలు అమాంతం పెరిగి సామాన్య ప్రజానీకం నడ్డివిరుస్తున్నాయి. ఎండాకాలంలో కూడా అంతగా కూరగాయల ధరలు పెరగకపోయినా వర్షాకాలం ప్రారంభంలో చుక్కలు చూపిస్తున్నాయి. రైతుబజార్‌లోనే ధరలు ఆకాశన్నంటేలా ఉండగా, ఇక బహిరంగ మార్కెట్లో ఏ కూరగాయ ధర చూసినా కిలో రూ.60లకు తక్కువ లేదు. కొన్ని అయితే ఏకంగా మూడంఖ్యల సంఖ్యను చేరాయి. పాత పంటలు స్థానంలో ఇప్పుడు కొత్త పంటలు వేయడం.. అలాగే వర్షాలు విరివిగా పడుతుండడంతో ట్రాన్స్‌పోర్ట్ సమస్యలు తలెత్తడం..ఇలా కారణాలేమైనా కూరగాయల ధరలు మాత్రం సామాన్య, మధ్య తరగతి ప్రజల బడ్జెట్‌పై పెను ప్రభావాన్నే చూపుతున్నాయి.



ఎర్రగడ్డ రైతు బజార్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

ఎందుకీ పరిస్థితి..

మార్కెట్లోకి రావాల్సిన కూరగాయల రాబడి భారీగా పడిపోయింది. క్వింటాళ్లలో దిగుబడి ఒక్కసారిగా తగ్గిపోవడంతో ధరలు పెరిగిపోయాయని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా వాతావరణంలో మార్పులు, సీజన్ మారడంతో కొత్త కాపు కోసం పంటలు వేస్తుంటారు. ఈ నేపథ్యంలో పాత కాపు తాలూకు ఆనవాళ్లన్నింటికీ సమూలంగా తొలగిస్తారు. ఈ నేపథ్యంలో కొత్త పంట వచ్చేసరికి సమయం పడుతుంటుంది. అప్పటి వరకు దిగుబడి అంతగా ఉండదు. ఇదిలా ఉంటే కొన్నిచోట్ల పంట కొనసాగుతున్నప్పటికీ భారీగా వర్షాలు కురుస్తుండడం మూలంగా కూరగాయలను సేకరించే పరిస్థితి లేకపోవడం, ఒకవేళ సేకరించినా ట్రాన్స్‌పోర్ట్ సమస్యలు తలెత్తుతుండడంతో మార్కెట్లకు వచ్చే కూరగాయలు భారీగా తగ్గిపోయాయి. డిమాండ్‌కు తగ్గట్లుగా మార్కెట్లకు దిగుమతి జరగకపోవడంతో ధరలు కాస్తా ఎకబాకాయని మార్కెట్ నిపుణులు స్పష్టం చేశారు. 20 నుంచి 60 శాతం మేర కూరగాయల ధరలు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

కర్రీ పాయింట్లకు పరుగులు..

పెరిగిన కూరగాయల ధరలతో ఏం తంటాలు పడతామని భావించి చాలా మంది తమ వంటింట్లో కూరల ఘుమఘుమలకు చెక్ పెట్టేశారు. దీంతో బయట కర్రీ పాయింట్ల వద్ద తమకు తోచిన కూరలు తెచ్చుకుని సరిపెట్టుకోవాల్సి పరిస్థితులు తలెత్తాయి. ఒకప్పుడు బ్యాచ్‌లర్స్‌కే అన్నట్లుగా ఉండే కర్రీ పాయింట్లు, ఇప్పుడు ఫ్యామిలీలకు కేరాఫ్‌గా మారిపోయాయి. ముఖ్యంగా పెరిగిన కూరగాయల ధరలు సామాన్య, మధ్యతరగతి కుటుంబాలను కర్రీ పాయింట్ల వైపు నడిపించేలా చేస్తున్నాయి.

గత నెలతో పోలిస్తే ప్రస్తుత ధరలు..

కూరగాయ	రైతుబజార్	బయట మార్కెట్
టమాటా	47	80
బెండకాయ	50	85
పచ్చిమిర్చి	60	95
బజ్జీమిర్చి	65	95
క్యాప్సికమ్	70	95
పచ్చకాకర	47	75
పందిరిబీర	75	105
బీన్స్	135	160
గింజచిక్కుడు	55	80
గోకరకాయ	50	75
కీర	32	48
దోసకాయ	25	45
బీట్‌రూట్	23	45
ఉల్లిగడ్డ	35	55
ఆలుగడ్డ	35	68

వర్షాల ప్రభావంతోనే..

వర్షాల ప్రభావంతో చాలాచోట్ల పంటను సేకరించే పరిస్థితులు లేవు. అలాగే ట్రాన్స్‌పోర్ట్ సమస్య ఒకటి ప్రధానంగా ఉంది. దీనికి తోడు పాత పంటలు స్థానంలో కొత్త పంటలు వేసే సీజన్ కావడంతో రైతుబజార్‌కు వచ్చే కూరగాయల శాతం తగ్గింది. ఆ ప్రభావంతో కాస్త కూరగాయలు ధరలు పెరిగాయి. కొన్ని రోజుల్లో ఈ పరిస్థితులు సర్దుకుని సాధారణ ధరలకు వస్తాయి.
– రమేష్, రైతుబజార్ ఎస్టేట్ అధికారి

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.47, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 47, పందిరి బీర 75, క్యాబేజీ 23, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 135, గింజ చిక్కుడు 55, గోకరకాయ 50, కీర 32, దోసకాయ 25, రూట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 35, చామగడ్డ 40, మొరంగడ్డ 40, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

మర్యాద పూర్వక కలయిక



దత్తాత్రేయతో బీజేపీ నాయకులు

బౌద్ధనగర్: హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను రాజ్‌భవన్‌లో సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు రవిప్రసాద్ గౌడ్, కందడి నాగేష్‌రెడ్డి, కనకట్ల హరి, ప్రభుగుప్త, దత్తు, అంబాల రాజు, మద్దెర్ల శ్యామ్, ఆకుల సంపత్, బైరి సురేష్, వినయ్‌కుమార్, కిషోర్‌గౌడ్, సంజయ్ కలిసి సన్మానించారు. కురుక్షేత్ర దేవాలయం దర్శనం చేయించి జ్ఞాపికలను అందజేశారు.

బాలుడి అదృశ్యం



షేక్ మహ్మద్

అడ్డగుట్ట: కుటుంబ సభ్యులు మందలించడంతో ఓ బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అమర్‌సింగ్ వివరాల ప్రకారం.. నార్త్‌లాలాగూడ లోని లిల్లీ మోడల్ స్కూల్ సమీప ప్రాంతానికి చెందిన షేక్ మహ్మద్(14) తల్లి పదేళ్లక్రితం చనిపోవడంతో స్థానికంగా ఉండే వారి బంధువుల ఇంట్లో ఉంటున్నాడు. ఇటీవల షేక్ మహ్మద్‌ను శేషాపహాడ్‌లోని మదర్సాలో చేర్పించారు. అయితే.. అతనికి మదర్సాకు వెళ్లడం ఇష్టం లేదని, ఏదైనా పనికి వెళ్తానని కుటుంబ సభ్యులతో చెప్పడంతో వారు నిరాకరించారు. పనికి వెళ్లే వయస్సు కాదని చెప్పి బాలుడిని గట్టిగా మందలించారు. ఈ నెల 13న మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తూ ఒత్తిడి తగ్గించాలి



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న జనార్దన్ యాదవ్

రాంగోపాల్‌పేట్: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీస్తూనే వారిలోని ఒత్తిడిని దూరం చేసేందుకు వ్యక్తిత్వ వికాస నిపుణులు కృషి చేయాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరరావు తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస నిపుణులకు 30 రోజుల పాటు ఆన్‌లైన్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సికింద్రాబాద్ గ్రాండ్ మినార్వా హోటల్‌లో రెండు రోజుల ఆఫ్‌లైన్ శిక్షణ అందించారు. శిక్షణ ముగింపు సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణులకు ఇంపాక్ట్ జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ సోనూ, ఉపాధ్యక్షులు డాక్టర్ ఆది చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా గంపా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నేటి విద్యార్థుల్లో తీవ్రమైన మానసిక ఒత్తిడి పెరిగిపోతుందని వారిలో ధైర్యాన్ని నింపి భయాన్ని దూరం చేసే బాధ్యత వ్యక్తిత్వ వికాస నిపుణులపై ఉందన్నారు. సినీ నిర్మాత, రిటైర్డ్ ఆర్మీ అధికారి బెల్లి జనార్దన్ యాదవ్ మాట్లాడుతూ.. ఇలాంటి శిక్షణ తమకు ఎంతో ఉపయోగపడుతుందని ఇక్కడ నేర్చుకున్న విషయాలు ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులకు వివరిస్తామన్నారు.

మంత్రికి వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఆనంద్ రావుకు పదోన్నతి కల్పించాలని శనివారం గిరిజన శక్తి రాష్ట్ర నాయకులు శరత్‌నాయక్ ఆధ్వర్యంలో మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం ఇచ్చారు. నారాయణగూడలోని విధులు నిర్వహిస్తున్న ఆనందరావును జాయింట్ ఫుడ్ కంట్రోలర్‌గా పదోన్నతి కల్పించాలని కోరారు.

మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలి



సంపత్‌కుమార్‌తో వడ్డె ఎల్లన్న

లాలాపేట: తెలంగాణలోని మాదిగలకు కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యం ఇవ్వాలని టీఎంఎస్ జేఏసీ చైర్మన్ వడ్డె ఎల్లన్న కోరారు. శనివారం ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి త్వరలో చేపట్టనున్న నామినేటెడ్ పదవుల్లో తమకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి



పాలిథీన్ కవర్లు అందజేస్తున్న మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: జంతు వ్యర్థాలను ఇష్టానుసారంగా వేయకుండా పాలిథీన్ కవర్లలో వేసి చెత్త సేకరించే సిబ్బందికి అందజేసి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 17న బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం తార్నాకలోని తన కార్యాలయం వద్ద ముస్లింలకు పాలిథీన్ కవర్లను అందజేశారు. పండుగలు, పర్వదినాలను ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ రజనీకాంత్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వీసీలను నియమించండి

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీల విషయంలో మాజీ సీఎం కేసీఆర్ బాటలోనే సీఎం రేవంత్‌రెడ్డి పయనిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ నాయకులు విమర్శించారు. శనివారం ఏఐఎస్ఎఫ్ నాయకులు నరేష్, నెల్లి సత్య ఆధ్వర్యంలో విద్యార్థులు ఓయూ లైబ్రరీ ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ రాష్ట్రంలోని వర్సిటీలకు తక్షణం వీసీలను నియమించాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా...

బంజారాహిల్స్: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన దృష్ట్యా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఒకరినొకరు పలకరించుకున్నారు. యాజమాన్యం, ఉపాధ్యాయులు సంతోషకరమైన వాతావరణాన్ని సృష్టించారు. పాఠశాల ఆవరణను స్ఫూర్తిదాయకమైన, ఆలోచింపజేసే శీర్షికలతో రూపొందించిన చార్టులు, పోస్టర్లను ఏర్పాటు చేశారు. చిన్న చిన్న స్కిట్స్, కథలు, సంగీతం, ఉపాధ్యాయుల నృత్య ప్రదర్శనలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ... అందుబాటులో ఉన్న వివిధ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌ఎం విధుమోహన్ మాట్లాడుతూ... నూతనోత్సాహం, ఉల్లాసంతో కొత్త విద్యా సంవత్సరం గడవాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు



పూజల్లో పాల్గొన్న నాయకులు

చిలకలగూడ: సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని బీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ నేతృత్వంలో చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహంకాళి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్, మేకల సారంగపాణి మాట్లాడుతూ.. వరుసగా రెండవ సారి కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డిని ఎంపిక చేసిన ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షాకు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటేష్‌గౌడ్, రాచమల్ల కృష్ణమూర్తి, ప్రకాశ్‌గౌడ్, కన్నాభిరామ్, హనుమంతుముదిరాజ్, రామువర్మ, శ్రీధర్‌రావు, రాజేష్, మ్యాకల చంద్రశేఖర్, శోభారాణి, అనూష, సత్యనారాయణ, సింహాచలం, ఈఎల్ ప్రతాప్, గోవర్దన్, మహేష్, సుభాష్, నరేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

బౌద్ధనగర్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కురుక్షేత్రం భద్రకాళి శక్తి పీఠంలోని అమ్మవారి దేవాలయంలో ఆ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేయించారు. ప్రజా సేవకై నిత్యం పరితపించే కిషన్‌రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నామన్నారు. పూజల్లో నాగేశ్‌రెడ్డి, రవిప్రసాద్‌గౌడ్, హరి, ప్రభుగుప్త, దత్తు, రాజేశ్వర్, శ్యామ్, సంపత్, వినయ్, సురేష్, కిషోర్ పాల్గొన్నారు.

కూల్చివేతల స్థలంలో నర్సరీ ఏర్పాటుకు చర్యలు



ఎఫ్‌టీఎల్ స్థలంలో మొక్కలు పెట్టిన దృశ్యం

సనత్‌నగర్: బేగంపేట మాతాజీనగర్‌ను ఆనుకుని ఉన్న హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలు కూలివేసిన ప్రదేశంలో నర్సరీ ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ఇక్కడ కూల్చివేతలు చేస్తున్నప్పటికీ పదేపదే అక్రమ నిర్మాణాలను చేపడుతూ వస్తుండడంతో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఇక్కడ నర్సరీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్కడి నిర్మాణాలను భారీ పోలీసు బందోబస్తు నడుమ రెండ్రోజుల క్రితం కూల్చివేసిన విషయం విదితమే. ఆ సమయంలో నర్సరీ బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా శనివారం భారీ ఎత్తున మొక్కలను తీసుకొచ్చి ఇక్కడ పెట్టారు.

28 కిలోల గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్: ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న గంజాయిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ సాయిశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం.. భువనేశ్వర్ రైల్వేస్టేషన్ నుంచి అదే ప్రాంతానికి చెందిన సిల్లు అందించిన గంజాయి బ్యాగులను తీసుకుని మహారాష్ట్రకు చెందిన ఆకాశ్‌కైలాష్ కన్నోజియా(31) అను వ్యక్తి ఈనెల 14న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరాడు. శనివారం సికింద్రాబాద్ చేరుకున్న ఆకాశ్‌కైలాష్ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అతడి బ్యాగులను తనిఖీ 28 కిలోల ఎండు గంజాయి ప్యాకెట్లు బయట పడటంతో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సిల్లుతో పాటు మహారాష్ట్రలో గంజాయి బ్యాగులను తీసుకోనున్న ముంబైకి చెందిన ఫిరోజ్‌ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పాత నేరస్తుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజేందర్

లాలాపేట: దోపిడీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాజేందర్ వివరాలను వెల్లడించారు. ఉప్పల్ విజయపురి కాలనీకి చెందిన పాకాల లోకేష(22) సెంట్రింగ్ పని చేస్తుంటాడు. అతడి స్నేహితుడు ఆంజనేయులతో కలిసి ఈ నెల 8న సాయంత్రం తార్నాక చౌరస్తాలో ఉన్న హెచ్‌పీ బంక్‌కు వెళ్లి రూ. 100 పెట్రోలు పోసుకుని డబ్బులు ఇవ్వకుండా పరార్ అవుతుండగా సిబ్బంది వారిని పట్టుకున్నారు. దీంతో రెచ్చిపోయిన లోకేష్ తన యాక్టివా డిక్కీలో ఉన్న బీర్ బాటిల్‌ను తీసుకుని బంక్ సిబ్బందిపై దాడికి పాల్పడగా ఒకరి చేతికి గాయమైంది. బంక్ ఉద్యోగి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం లోకేష్‌ను తార్నాకలో పట్టుకుని విచారించగా ఆ ద్విచక్ర వాహనం సైతం దొంగిలించినట్లు గుర్తించి రిమాండ్‌కు తరలించారు. ఆంజనేయులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై వివిధ స్టేషన్ల పరిధుల్లో 10 కేసులు నమోదైనట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సుధాకర్‌ను పరామర్శిస్తున్న నేతలు

అడ్డగుట్ట: డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఎంఎస్. సుధాకర్ అస్వస్థతకు గురవ్వడంతో వైద్యులు ఎడమకాలి భాగం తొలగించారు.స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ద్వారా విషయం తెలుసుకున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ స్పందించి ఆర్థిక సాయం చేశారు. శనివారం ఉదయం పద్మారావుగౌడ్ తనయుడు రామేశ్వర్‌గౌడ్ స్థానిక నాయకులతో కలిసి అడ్డగుట్ట గడ్డమీది బస్తీలోని సుధాకర్ నివాసానికి వెళ్లి బాధితుడికి రూ. 50 వేల ఆర్థిక సాయం అందించి ప్రభుత్వం ద్వారా సహకారం అందించేలా కృషి చేస్తామని చెప్పారు.

ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలి

సనత్‌నగర్: బేగంపేట మాతాజీనగర్‌ను ఆనుకుని ఉన్న సర్వేనెంబర్ 194/8/1లోని 10 ఎకరాల 20 గుంటల ఎఫ్‌టీఎల్ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలకు జీహెచ్‌ఎంసీ అధికారులు ఇంటి నెంబర్లు ఏలా మంజూరు చేశారని బీజేపీ సీనియర్ నేత నెమలి ఆనంద్ ప్రశ్నించారు. అదే విధంగా విద్యుత్ అధికారులు విద్యుత్ మీటర్లు కూడా జారీ చేయడం ఏంటని మండిపడ్డారు. వీటిపై పూర్తి సమాచారం కోసం సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినట్లు ఆయన చెప్పారు. బేగంపేట శ్యాంలాల్‌బిల్డింగ్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓ సంస్థ చేసిన రియల్ ఎస్టేట్ మోసానికి ఎంతోమంది అమాయకులు నష్టపోయారన్నారు. అమాయకులను నిలువునా ముంచిన సదరు సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులే కూల్చివేస్తారు..అదే అధికారులే ఇంటి నెంబర్లు ఇస్తారు..దీని ద్వారా అంతిమంగా మోసపోయింది అమాయక జనమేనన్నారు.

దయచేసి వినండి.. ఇక్కడ చెత్త వేయకండి!



సనత్‌నగర్: చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు వివిధ రకాలుగా అవగాహన కల్పిస్తున్నా కొంత మంది నిర్లక్ష్యంగా ఆ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. కాలనీలు, బస్తీల్లో ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ డంపింగ్ యార్డుగా మారుస్తున్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు మరో అడుగు ముందుకేసి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చెత్త, వ్యర్థాలు ఉండే ప్రాంతాలను శుభ్రం చేయించి ముగ్గులు వేసి అక్కడే కూర్చుని టిఫిన్ చేస్తూ మరోసారి ఈ ప్రాంతంలో చెత్త వేయొద్దని అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం బేగంపేటలోని జీవీపీ వద్ద ఉన్న చెత్తను తొలగింపజేసి కళ్లాపి చల్లి అందంగా రంగురంగుల ముగ్గులు వేశారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య నేతృత్వంలో డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, శానిటేషన్ సూపర్‌వైజర్ ధనగౌడ్‌తో పాటు శానిటేషన్ ఉద్యోగులు, సిబ్బంది అక్కడే కూర్చొని అల్పాహారం తింటూ అటుగా రాకపోకలు సాగించే వారికి ఇక్కడ చెత్త వేయొద్దని కోరారు. మరోసారి ఇక్కడ చెత్త వేస్తే వారిని గుర్తించి రూ.1000ల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

జోరందుకున్న పొట్టేళ్ల విక్రయాలు





చిలకలగూడ మైదానంలో గొర్రె పొట్టేళ్ల విక్రయాలు

చిలకలగూడ: బక్రీద్ సందర్భంగా పొట్టేళ్ల విక్రయాలు జోరందుకుంటున్నాయి. చిలకలగూడ మున్సిపల్ మైదానంలో తాత్కాలిక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జీహెచ్‌ఎంసీ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన సుమారు 50 స్టాల్స్ వద్ద మేకలు,పొట్టేళ్ల క్రయవిక్రయదారులతో సందడి నెలకొంది. పలు మసీదులు, ఛిల్లాలతోపాటు చిలకలగూడ ఈద్గా మైదానాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఆంధ్ర, కర్నాటక, జమ్ముకశ్మీర్, రాంపూర్, మహారాష్ట్రతోపాటు తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున గొర్రెపొట్టేళ్లు దిగుమతి అయ్యాయి. ఈసారి పొట్టేళ్ల విక్రయాలు జోరుగా సాగాయని, మెలితిరిగిన కొమ్ములు, పెద్ద చెవులతో ఆకర్షణీయంగా ఉన్న పొట్టేళ్లు మంచి ధరలకు అమ్ముడుపోయావని విక్రయదారులు మస్తాన్, సల్మాన్ సంతోషం వ్యక్తం చేశాడు. ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు చిలకలగూడ సీఐ అనుదీప్ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టారు. పొట్టేళ్ల వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని జీహెచ్‌ఎంసీ డీసీ సుభాష్‌రావు తెలిపారు.

అప్రమత్తతతో సైబర్ నేరాలకు చెక్

- సైబర్ నేరాలపై అవగాహన అవసరం
- ఎఫ్ఎన్ సైబర్ సంస్థ వ్యవస్థాపకుడు శంషేర్ ఖాన్



పంజగుట్ట: సైబర్ క్రైంపై ప్రజల్లో ఎంతో అవగాహన పెరగాల్సి ఉందని ప్రతి సంవత్సరం సైబర్ నేరాలు పెరుగుతూనే ఉన్నాయని ఇది ఇలానే కొనసాగితే రాబోయే తరాలకు ఎంతో ప్రమాదమని ఎఫ్ఎన్ సైబర్ సంస్థ వ్యవస్థాపకుడు శంషేర్ ఖాన్ అన్నారు. 2019లో సైబర్ నేరాలపై 26వేల ఫిర్యాదులు రాగా 2023లో 15 లక్షల 56 వేల ఫిర్యాదులు అందాయని, ఈ సంవత్సరం ఇప్పటికే 8 లక్షల ఫిర్యాదులు వచ్చాయని, ఇవి కేవలం ఫిర్యాదు చేసిన వారి సంఖ్య అని ఇంకా సిగ్గుతో ఫిర్యాదు చెయ్యనివారు ఎందరో మోసపోయి ఉంటారని ఆయన పేర్కొన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. అనవసరమైన జాబ్ యాప్‌లు, మనీ యాప్‌లు, మీరు లక్షలమందిలో ఒక్కరు గిఫ్ట్‌కు ఎంపికయ్యారని ఫోన్‌లు చేసి ఓటీపీ అడగడం లాంటివి చెయ్యడంవల్ల మన ప్రైవసీ మొత్తం వారికి వెళ్లిపోతుందని మనం ఎవరితో మాట్లాడుతున్నాం, ఫోన్‌లో ఏం చూస్తున్నాము, మన బ్యాంకులో ఎంతడబ్బు ఉంది, డబ్బులు కాచెయ్యడం అవుతుంటాయన్నారు. వీటిపై ప్రజల్లో అవగాహన చాలా తక్కువఅని, స్కూల్స్‌ల్లో, కాలేజీల్లో వీటిపై ఎలాంటి పాఠాలు లేవన్నారు. మనం ఏదైనా యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే అందులో మైక్ ఆప్షన్‌ను మనం ఎంపికచేసుకుంటామని దీంతో మనం మాట్లాడిన ప్రతీ కాల్ వారికి వెలుతుందన్నారు. మన దేశంలో సుమారు 20 కోట్లమంది ఆధార్‌కార్డుల డేటా సైబర్ నేరస్థులవద్ద ఉన్నాయన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల్లో, కాలేజీల్లో, బహిరంగ ప్రదేశాల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

అవయవ దానంతో మరొకరికి జీవితం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం

అమీర్‌పేట: దేవుడు జన్మనిస్తే, అవయవదానం పునర్జన్మనిస్తుందని తెలుగు నేపథ్య గాయని సమీరా భరద్వాజ్ అన్నారు. మోహన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమీర్‌పేట మెట్రో రైల్ స్టేషన్‌లో శనివారం సాయంత్రం అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెట్రో టు మెట్రో పేరిట జరిగిన ఈ కార్యక్రమానికి సమీరా భరద్వాజ్ హాజరై మాట్లాడారు. మరణానంతరం ఒకరు చేసే అవయవదానం మరో నలుగురికి జీవితాన్ని ఇస్తుందన్నారు. అవయవదానం పట్ల ఎలాంటి అపోహలు అవసరం లేదని, మానవత్వంతో ముందుకొచ్చి ప్రతి ఒక్కరూ అవయవదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు, అవయవదానానికి ముందుకు వచ్చిన వారితో కలిసి మెట్రో స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై వాక్ చేసి అలరించారు. తాము అవయవదానానికి అంగీకరించామంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డా.ప్రశాంత్ గర్గ్, డా.లక్ష్మి, మనీల, నటి గాయత్రి భార్గవి, సినీదర్శకులు శైలేష్, స్వర్ణలత, కమల్ కిరణ్ పాల్గొన్నారు.

బ్రాహ్మణులను ఆర్థికంగా బలోపేతం చేయాలి

లిబర్టీ: అన్నింటా వెనుకబడిన బ్రాహ్మణులకు ప్రభుత్వాలు చేయూతనివ్వాలని భారతీయ ధార్మిక సేవా సమితది జాతీయ అధ్యక్షుడు కె.వి.ఎస్.శర్మ కోరారు. బ్రాహ్మణులు ఆర్థికంగా చితికిపోయి దయనీయ జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. శనివారం భారతీయ ధార్మిక సేవా సమితి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అర్చకత్వం చేసుకుంటూ బ్రాహ్మణులు సాధారణ జీవితం వెల్లదీస్తున్నారన్నా. సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిన బ్రాహ్మణులు ఆర్థికంగా దెబ్బ స్థాయిలో ఉన్నారని ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసినా బ్రాహ్మణులు ఆర్థికంగా అభివృద్ధి చెందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.